

# పరదేశీ కథలు

## - లలిత చిట్టే



-75 -

## ఎడారిలో వానజల్లు

వంటింటి గోడకు చేరగిలబడి ఖళ్లు ఖళ్ళు మని దగ్గుతోంది నరసమ్మ. ఎడతెగని దగ్గుతో ఊపిరి పీల్చుకోవడం కష్టమైపోతోందామెకు. ఇంతలో సేతాని ఈ శబ్దం విని వంటింట్లోకి రానే వచ్చింది.

"యా అల్లా.. ఏమయింది నీకు? ఈ మధ్య రోజూ దగ్గుతున్నావు. రేపు పొద్దున్నే డ్రైవర్ను తీసుకుని హాస్పిటల్ కు పోతావా?" అడిగింది.

"హా మామా. ఒకసారి హాస్పిటల్ కి వెళ్ళాలి. తట్టుకోలేకున్నాను. రాత్రిపూట కూడా నిద్రలేకుండా చేస్తోంది ఈ దగ్గు" నీరసంగా చెప్పింది నరసమ్మ.

ఇంతలో అక్కడికి వచ్చిన సేతాని కూతురు హయాత్. "నూరా నీకు వయసయిపోయింది. నువ్వింక పని చెయ్యలేవు. నీ కూతుర్ని ఇక్కడికి రప్పించి నువు విశ్రాంతి తీసుకో" నవ్వుతూ చెప్పింది.

పేలవంగా నవ్వింది నరసమ్మ.

"నా కూతురు నాలాగా కాకూడదనే పెద్ద చదువులు చదివించాను. ఆఫీస్ లో వుద్యోగం చేస్తుంది కానీ కువైట్ కి వచ్చి ఇలా వంటపని చెయ్యదు కదా" చెప్పి నిట్టూర్చింది నరసమ్మ.

"నీ కూతురు జయ నా ఈడుదే కదా" ఉత్సుకతతో అడిగింది హయాత్.

ఊహ తెలిసినప్పటినుండీ నరసమ్మ గురించీ, పిల్లల గురించీ ఎన్నిసార్లు విన్నా కూడా ప్రతిసారీ కొత్తగా అడుగుతూనే వుంటుంది హయాత్. అదొక సరదా, సంతోషం ఆమెకు.

"అవును అక్కడ ఆర్నెల్లపిల్లను మా అత్త చేతిలోబెట్టి కువైట్ ఫ్లైట్ ఎక్కి వచ్చాను.

అప్పుడు నువ్వికక్కడ నాలుగునెలల బిడ్డవి.

నిన్ను చూసుకోవడానికే మీ అమ్మనాన్న నన్ను పిలిపించారు.

నిన్నుచూసి నీ బోసినవ్వులతో నా బిడ్డమీది దిగులును కాస్త మరిచిపోయాను" ఆ రోజులను గుర్తుచేసుకుంది నర్సమ్మ.

"అవునులే ఆ సంగతి నాకు తెలుసు. మా అమ్మకంటే ఎక్కువగా నన్ను చూసుకున్నావు. అందుకే నువ్వంటే నాకిష్టం" మెరిసే కళ్ళతో కృతజ్ఞతగా చెప్పింది హయాత్.

"నీలో నా బిడ్డను చూసుకున్నాను అంతే" సంతోషంగా చెప్పింది నరసమ్మ.

"సరే ఆగకుండా దగ్గుతున్నావు. నువ్వెళ్ళి ఈ పూట రెస్ట్ తీసుకో నేను వంట చేస్తాను". మామా చెప్పింది

"అయ్యో మీకెందుకు శ్రమ మామా. ఇదేమీ పెద్దపని కాదు కదా. నాకేమీ పరవాలేదు. అలవాటయిన పనే కదా. రేపు వెళ్ళి డాక్టర్ కు చూపించుకుంటా" చెప్పింది నరసమ్మ.

"ఆ అలాగే మర్చిపోకుండా వెళ్ళు. ఆరోగ్యం ముఖ్యం" అని చెప్పి వెళ్ళిపోయింది మామా. అంతటితో ఆగలేదు నరసమ్మ దగ్గు. సింక్ లో ముఖం కడుక్కుంటుంటే రక్తపు చారికలు కనబడ్డాయి. మనసు ఏదో కీడును శంకించింది.

మరుసటి రోజు.. డ్రైవర్ని తీసుకుని ఆ ఏరియాలో వున్న ముస్తష్ఫా (ఆసుపత్రి) కెళ్ళింది. డాక్టర్లు అన్ని టెస్టులూ చేసి "కొంచెం ప్రాబ్లం వుంది 10 రోజులు ఇక్కడే బెడ్ లో వుండి ట్రీట్మెంట్ తీసుకోవాలి. ఈ విషయం మీ మామా బాబాకు చెప్పు. డ్రైవర్ని పంపించి బట్టలు తెప్పించుకో" అని సలహా ఇచ్చారు. ఇంతవరకూ ఇన్నేళ్ళలో హాస్పిటల్ మొహం చూడని ఆమె అక్కడే పదిరోజులు వుండాలి అనేసరికి భయపడింది. డ్రయివర్ కి విషయం చెప్పి పంపించి వెయిటింగ్ రూం లో కూర్చుంది.

ఇరవై అయిదేళ్ళ తన కువైట్ జీవితం కళ్ళముందు గిర్రున తిరుగుతోంది. పాముకాటుతో భర్త పోగానే బతుకుదెరువు కోసం గుండెను రాయిగా చేసుకుని పిల్లల్ని వదిలేసి వచ్చిందే కానీ తల్లిగా ఎంత మథన పడిందో ఆమెకే తెలుసు. ఇలా బిడ్డలను వదిలేసి వచ్చిన తల్లులు ఎంతమంది ఈ గల్ఫ్ లో వ్యథను అనుభవిస్తున్నారో పాపం. ఇక్కడ ఇన్నేళ్ళు పనిమనిషిగా కోరికలను చంపుకుని ఒక యంత్రంలా ఎలా పని చేసిందో, పిల్లల కోరికలను తీర్చడానికి ఎంత డబ్బును పంపించిందో, పిల్లల చదువులకోసం ఎంత వెచ్చించిందో, ఒకసారి మననం చేసుకుంది.

మొన్న వచ్చినట్లుంది అప్పుడే ఇన్నేళ్ళు గడిచిపోయాయంటేనే ఆశ్చర్యంగా వుంది. మామాబాబా మంచివాళ్ళు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇన్నేళ్ళు ఒకటే ఇంట్లో వుండి పని చేయగలిగి వుండేదా? సాధ్యం కాదేమో.

ఇంతవరకూ జీవితం సాఫీగానే సాగిపోయింది. వయసు యాభై యేళ్ళు దాటాయి. ఇక్కడ వంటపని చెయ్యడం కష్టంగానే వుంది. మన వంటలు కాదుగా. అవయితే గంటలో చేసెయ్యచ్చు. ఇక్కడ ఈ అరబిక్ వాళ్ళకి రకరకాల వంటలు

వండి పెట్టాలి. పని చెయ్యడానికి ఈ మధ్య శక్తి సరిపోవడం లేదు. ఈ మధ్య కాలంలోనే ఆరోగ్యం గురించి కాస్త భయంగా వుంది.

కొడుక్కి పెళ్ళి చేసింది కానీ కూతురికే మంచి సంబంధం చూసి పెళ్ళిచేయాలి. ఆ బాధ్యత కూడా తీరిపోతే తరువాత ఇండియాకు వెళ్ళిపోయి ఎక్కడో ఒకచోట నిశ్చింతగా కాలం గడపవచ్చు. ఆలోచనలు మస్తిష్కాన్ని వేడెక్కిస్తున్నాయి.

ఇంతలో డ్రైవరు మామాను కూడా తీసుకుని వచ్చాడు. అతనితోపాటు వచ్చిన మామా కంగారుపడింది. దాదాపు ఇరవైఅయిదేళ్ళుగా నిర్విరామంగా వాళ్ళింట్లో పనిచేస్తోంది. ఏ టైములో ఏదిఅడిగినా ఇష్టంగా వండిపెడుతుంది. చెప్పిన ప్రతిపనీ సంతోషంగా చేస్తుంది. నరసమ్మ లేకపోతే ఒకరోజు కూడా గడవదనేట్లుగా ఆమె ఆ కుటుంబంలో కలిసిపోయింది. అందుకే కువైటీ వాళ్ళకు నరసమ్మంటే అభిమానం. ఇప్పుడు నరసమ్మ ఆరోగ్యం గురించి మామా కూడా వర్రీ అవుతూ "నూరా నీకేమీ పరవాలేదు. నువ్వు భయపడకు. మేము డాక్టర్లతో మాట్లాడి ఏమయ్యిందో కనుక్కుంటాం. ఎంత డబ్బు ఖర్చయినా పరవాలేదు నీకు బాగయ్యేట్లు మేము చూస్తాం" అంది ధైర్యం చెపుతూ.

"అయ్యో నేను భయపడటం లేదు మామా. మీరుండగా నాకు భయమెందుకు" అంది నూరా నవ్వుతూ.

"సరే జాగ్రత్తగా వుండు. ఏ అవసరమయినా ఫోన్ చెయ్యి. వెంటనే వస్తాం" అని చెప్పి డ్రైవర్తో పాటూ వెళ్లిపోయింది

ఇక మూడురోజులపాటూ రోజూ అదనీ ఇదనీ టెస్టులేవో చేసారు. ఆ రిజల్ట్స్ రావడానికి కొంచెం ఆలస్యం అవుతుంది అన్నారు. నర్సుల పర్యవేక్షణలో మూడుపూటలా మంచి ఆహారాన్ని అందిస్తున్నారు. వేళకు వేసుకోవాల్సిన మందులను తెచ్చి ఇస్తున్నారు. హాస్పిటల్లో అన్ని సౌకర్యాలూ కలిగిస్తున్నప్పటికీ ఏదో భయం. నిద్ర రావడం లేదు నరసమ్మకు. పక్కరూముల్లో వున్న కొందరు పేషెంట్లు, ఆయాలు వచ్చి అపుడపుడూ ఏదో పిచ్చాపాటీ మాట్లాడి వెళుతున్నారు. అయినా ఎవరి మాటలూ బుర్రకు ఎక్కడం లేదు. తనకేదైనా అయితే కూతురి పెళ్ళి ఎవరు చేస్తారు? పిల్ల జీవితంలో స్థిరపడివుంటే బావుండేది. కాస్త దిగులుగా అనిపించింది. ఇన్నేళ్ళ ఎడారి పయనంలో ఎప్పుడూ అనిపించలేదు కానీ ఇప్పుడెందుకో ఒంటరిదాన్ననిపించింది. అలా అనుకుంటుంటే కళ్ళలో నీళ్లొచ్చేసాయి. మామా బాబా మంచివాళ్ళు కాబట్టి, బాగా చూసుకునేవాళ్ళు కాబట్టి సరిపోయింది. అదే అందరి కువైటీల్లాగా కొట్టేవాళ్ళయితే? ఇక మూడురోజులపాటూ రోజూ అదనీ ఇదనీ టెస్టులేవో చేసారు. ఆ రిజల్ట్స్ రావడానికి కొంచెం ఆలస్యం అవుతుంది అన్నారు.

నర్సుల పర్యవేక్షణలో మూడుపూటలా మంచి ఆహారాన్ని అందిస్తున్నారు. వేళకు వేసుకోవాల్సిన మందులను తెచ్చి ఇస్తున్నారు. హాస్పిటల్లో అన్ని సౌకర్యాలూ కలిగిస్తున్నప్పటికీ ఏదో భయం. నిద్ర రావడం లేదు నరసమ్మకు. పక్కరూముల్లో వున్న కొందరు పేషెంట్లు, ఆయాలు వచ్చి అపుడపుడూ ఏదో పిచ్చాపాటీ మాట్లాడి వెళుతున్నారు. అయినా ఎవరి మాటలూ బుర్రకు ఎక్కడం లేదు.

తనకేదైనా అయితే కూతురి పెళ్ళి ఎవరు చేస్తారు. పిల్ల జీవితంలో స్థిరపడివుంటే బావుండేది.

కాస్త దిగులుగా అనిపించింది. ఇన్నేళ్ళ ఎడారి పయనంలోనెప్పుడూ అనిపించలేదు కానీ ఇప్పుడెందుకో ఒంటరిదాన్ననిపించింది. అలా అనుకుంటుంటే కళ్ళలో నీళ్లొచ్చేసాయి.

మామా బాబా మంచివాళ్ళు కాబట్టి, బాగా చూసుకునేవాళ్ళు కాబట్టి సరిపోయింది. అదే అందరి కువైటీల్లాగా కొట్టేవాళ్ళో తిట్టేవాళ్ళో అయితే ఏంటి పరిస్థితి. ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడాలనిపించింది. కానీ దగ్గర ఫోన్ లేదుగా.

ఎలా అనుకుంటుంటే ఆరోజు మామా వచ్చింది. పిల్లలకు ఫోన్ చేయించి మాట్లాడించింది. నువు దిగులు పడద్దు అని ధైర్యం చెప్పింది.

దేశం కాని దేశంలో అనారోగ్యం క్రుంగదీస్తే ఎంత అధైర్యంగా వుంటుందో అనుభవంలోకి వచ్చిందామెకు. రిజల్ట్స్ వచ్చాయి. డాక్టర్లు ఫోన్ చేసి మామా బాబా తో మాట్లాడారు.

ఈ వార్డునుండి వేరే చోటికి మార్చాలి అక్కడ మంచి మందులున్నాయి అంటూ నరసమ్మను అక్కడే అదే కాంపౌండ్లో వున్న వేరే విభాగానికి మార్చారు. ఇదేదో చిన్న విషయం కాదనిపించింది నరసమ్మకు. పిల్లల్ని ఒకసారి చూడాలనిపించింది.

ఆ రోజు మామాతో పాటూ హయాత్ కూడా వచ్చింది. నరసమ్మను చూసి కళ్ళనీళ్లు పెట్టుకుంది. కువైట్ అమ్మాయి అయినా నరసమ్మ ఒడిలో పెరిగిన పిల్లే కదా. మనసుకు హత్తుకున్న బంధం. హయాత్ లో జయను చూసుకునే నరసమ్మ తన స్వంతబిడ్డను చూసినట్లే సంతోషించింది.

"అయ్యో పిచ్చిపిల్లా నువ్వు ఏడుస్తావెందుకు నాకేమీ కాదు. నాల్రోజుల్లో ఇంటికి వచ్చి నీకు దిజాజ్ మసిబూసి (అరబిక్ చికెన్ రైస్) వండి పెడతాగా" అంటూ నరసమ్మే ఓదార్చింది.

డాక్టర్లు చూస్తున్నారు. ఎన్నో రకాల మందులిస్తున్నారు.

పెద్ద డాక్టర్లు వచ్చి పరిశీలించారు. రోజులు గడిచాయి. చివరికి నరసమ్మకున్న జబ్బు కేన్సర్ అని తేల్చి చెప్పారు. కానీ ఈ విషయం నరసమ్మకు తెలిస్తే భయపడుతుందని భావించిన డాక్టర్లు ఆమెకు చెప్పకుండా మామా బాబాకు ఫోన్ చేసి చెప్పారు. కేన్సర్ ముదిరిపోయిందనీ ప్రస్తుతం నరసమ్మ కండిషన్ సీరియస్ గా వుందని కూడా తెలియజేసారు. సంగతి తెలిసిన మామా బాబా ప్రాన్పడి పోయారు. ఎంత డబ్బు ఖర్చయినా పరవాలేదు. మెరుగైన ట్రీట్ మెంట్ అందించమని డాక్టర్లను అర్థించారు. ఆమె తన ఆరోగ్యాన్ని చాలా అశ్రద్ధ చేసారు. ఇంతవరకూ చెప్పకుండా వుండటం వలన కేన్సర్ ముదిరిపోయి లాస్ట్ స్టేజ్ కి చేరుకుంది. మా వంతు ట్రీట్మెంట్ మేము అందిస్తాము. మిగతాది అల్లా చూస్కుంటాడు. ఆయన దయ అని తేల్చి చెప్పేసారు డాక్టర్లు.

మందులతో ఆరోగ్యం ఇంకా దిగజారిపోతోందే తప్ప నర్సమ్మ కొంచెంకూడా కోలుకోవడంలేదు. నెల గడిచేసరికల్లా ఎముకల గూడులా తయారయింది. ఏదో పెద్ద జబ్బనీ తనకు రోజులు దగ్గర పడుతున్నాయని నర్సమ్మకు అర్థమయింది. మామా బాబా ఫోన్ చేసి ఇంటి దగ్గర వున్న నర్సమ్మ పిల్లలకు విషయాన్ని వివరించి చెప్పారు. అక్కడ వాళ్ళూ కంగారు పడ్డారు.

ఇక్కడ హయాత్ అయితే దు:ఖాన్ని హృదయంలో అణిచిపెట్టుకుంటోంది. పెంచిన ప్రేమ మదినికలవరపెడుతోంది. తెల్లవారగానే రోజూ వంటింట్లో వుండి మూడుపూటలా వండిపెట్టే నర్సమ్మ ఇంట్లో లేకపోయేసరికి పిచ్చి పట్టినట్లుంది. అప్పటికీ వంటింట్లోకీ హాల్లోకీ పదిసార్లు కాలుగాలిన పిల్లిలా తిరిగింది హయాత్.

ఒకట్రెండుసార్లు "నూరా టీ ఇస్తావా.. గహ్వ (అరబిక్ కాఫీ)ఇస్తావా" అంటూ కేకలేసింది. జవాబు రాకపోయేసరికి నర్సమ్మ హాస్పిటల్లో వుందనే సంగతి గుర్తొచ్చి నాలిక్కర్చుకుంది. తను పుట్టినప్పటినుండీ ఇప్పటివరకూ నర్సమ్మ చుట్టూ తిరగడంతోనే కాలం గడిచింది. తనలో నర్సమ్మ పట్ల ఇంత ప్రేమ వుందని తెలియనే లేదు. ఆమెకు కేన్సర్ అని తెలియగానే హయాత్ లో మమకారం పెల్లుబుకుతోంది.

కానీ ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. ఈ కేన్సర్ మహమ్మారి నుండి నర్సమ్మను ఎలా కాపాడుకోవాలో తెలియక బాధపడుతోంది హయాత్. పొంగిపొరలే ఆవేదనను భరించలేక ఆరోజు తనొక్కటే కారులో కూర్చుని హాస్పిటల్ కి బయలుదేరింది హయాత్. ముందుగా డాక్టర్లను కలిసి నర్సమ్మ కండిషన్ ఏమిటో అడిగింది. డాక్టర్లు పెదవి విరిచి "సారీ.. ఇంకొన్ని రోజులే ఆమెను మేము కాపాడగలం" అన్నారు. కంట్లో చిప్పిల్లే కన్నీళ్ళను కొనగోటితో తుడుచుకుని నర్సమ్మ దగ్గరికి వెళ్ళింది హయాత్.

హయాత్ ను చూసి నవ్వింది నర్సమ్మ."ఈ చివరి ఘడియల్లో కన్నబిడ్డలు దగ్గర లేకపోయినా నువ్వు నా దగ్గర వుండటం సంతోషాన్ని కలిగిస్తోందమ్మా" చెప్పింది నీరసంగా. తలపంకించింది హయాత్.

"నీకేమీ కాదు. భయపడకు. నీకు మేమున్నాము. మా ప్రాణాలను అడ్డువేసి నిన్ను కాపాడుకుంటాము" అని ధైర్యం చెప్పింది.

హయాత్ మాటలకు కాస్త ధైర్యమొచ్చినట్లుంది. కళ్ళలోకి వెలుగు వచ్చింది నర్సమ్మకు. కువైట్ పిల్లయినప్పటికీ హయాత్ చూపించే ప్రేమ ఆమెకు ఊరట కలిగించింది.

వారం రోజులు గడిచాయి. ఇంకా క్షీణించిపోతోంది నర్సమ్మ. మాట్లాడే శక్తి కూడా తగ్గిపోయి మాట తడబడసాగింది. మంచంలోనుండి లేవలేకపోతోంది. వాడే మందులు విషాన్ని తలపిస్తున్నాయి. లోపల అగ్ని లావాలా పొంగుతోంది. నరకయాతనను పంటిబిగువున భరిస్తోంది. ఇక ఎన్నోరోజులు బతకనని ఆమెకు

తెలిసిపోయింది. బిడ్డలే కళ్ళముందు మెదులుతున్నారు. ఒక్కసారి వాళ్ళ ముఖాలు చూడాలని ప్రాణం కొట్టుకులాడుతోంది. కానీ ఏమి చేయగలదు? నిస్సహాయంగా కాలాన్ని గడుపుతూ తనను తొందరగా తీసుకెళ్ళమని ఈ బాధనుండి విముక్తి కలిగించమని దేవుడ్ని ప్రార్థించసాగింది.

ఆ రోజు హయాత్ నర్సమ్మ దగ్గరికి వచ్చింది. నవ్వుతూ "నీకోసం ఎవరొచ్చారో చూడు" అంది.

"ఎక్కడా ఎవరూ" అంది నర్సమ్మ తలుపుకేసి చూస్తూ. చిన్నప్పటినుండీ ఇలా దాక్కుని, ఆటబొమ్మలను దాచిపెట్టి ఆటపట్టించడం హయాత్ కు అలవాటే. బయట గోడ చాటున నిలబడిన నర్సమ్మ బిడ్డలను లోపలికి తీసుకొచ్చింది హయాత్.

ఆశ్చర్యంగా చూసింది నర్సమ్మ. నమ్మలేనట్లు. నిజమా కాదా అని కళ్ళు పెద్దవి చేసి చూసింది నర్సమ్మ. సంతోషంతో చిరునవ్వు పెదవులపైకి వచ్చి చేరింది. తనకోసం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి తనపట్ల ప్రేమను చాటుకున్న హయాత్ వైపు కృతజ్ఞతగా చూసిందామె. తల్లి పరిస్థితిచూసి బిడ్డలిద్దరూ తల్లడిల్లిపోయారు. ఏడిస్తే అమ్మ బాధపడుతుందని కన్నీటిని లోపలే దాచుకున్నారు. పిల్లల్ని కళ్ళారా చూసుకుని మురిసిపోయింది నర్సమ్మ.

"జయ నాకు తోబుట్టువులాంటిది. జయ పెళ్ళి నేను చేస్తాను. నువు బాధపడకు నర్సమ్మా" అని చెప్పింది హయాత్ భరోసానిస్తూ. ఎడారిలో వానజల్లు కురిసినట్లు నర్సమ్మ హృదయం ఆనందించింది.

తృప్తిగా నిట్టూర్చింది ఆ తల్లి. ఇక మాట్లాడటానికి ఏమీ లేదన్నట్లు మౌనంగా ముగ్గురు బిడ్డలనూ కళ్ళతో చూసుకుంటూ మనసు నిండా నింపుకోసాగింది.

బిడ్డలను చూడటానికే ఆమెలో ప్రాణం అంతవరకూ నిలబడిందన్నట్లుగా ఆ మరుసటిరోజే నర్సమ్మ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments